క్లుప్తంగా

ఆలయాల నిర్మాణానికి సహకారం



70 బస్తాల సిమెంట్ అందజేస్తున్న ముల్లు రమణ

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనేందుకు గాను ఆలయాల నిర్మాణానికి తమ ట్రస్టు ఆధ్వర్యంలో పూర్తి సహాయ, సహకారాలు అందించనున్నామని పట్టణానికి చెందిన శ్రీ దుర్గామల్లేశ్వర సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు ముల్లు రమణ చెప్పారు. ఆదివారం ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుర్ల మండలంలోని గరికివలస గ్రామంలో నిర్మిస్తున్న రామాలయానికి 70 బస్తాల సిమెంట్ అందజేశారు. కార్యక్రమంలో గరికివలస గ్రామ పెద్దలు బెల్లాన నారాయణ, బెల్లాన సత్యం, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం



సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్ గడే సత్యవతి, మోహనరావు దంపతులు

చీపురుపల్లి: సచివాలయాల్లో ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు ఎంతో విలువైన సేవలు అందించారని చిననడిపల్లి సర్పంచ్ గడే సత్యవతి అన్నారు. మండలంలోని పెదనడిపల్లి గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తూ వేరే ప్రాంతానికి బదిలీ జరిగిన సిబ్బందికి చిననడిపల్లిలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడిందన్నారు. కార్యక్రమంలో గడే మోహనరావు, ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..



తులసీరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ శాసనసభ్యుడు బొత్స, తదితరులు

బొండపల్లి: గొట్లాం గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండలస్థాయి నాయకుడు మీసాల తులసీరావు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదివారం పరామర్శించారు. తులసీరావు భార్య సరోజిని, కుటుంబ సభ్యులను కలిసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శలో బీవీ ప్రభాజీరాజు, ఎంపీపీ చల్ల నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మహంతి రమణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి సమస్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు

గజపతినగరం: మండలంలోని తుమికాపల్లిలో టీడీపీ నాయకులు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, తదితరులు ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనపై వివరించారు. ఇదిలా ఉంటే స్థానికులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తల్లికి వందనం అందరికీ పడలేదని..స్థానికంగా ఉన్న సమస్యలను మంత్రికి తెలియజేయగా..పరిష్కరించేందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు గంట్రోతు గోవిందరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ఊరేగింపు



హంసవాహనంపై కొలువుదీరిన శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

విజయనగరం టౌన్: నగరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ఊరేగింపు అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి వారి ఆలయం నుంచి నీళ్లట్యాంకు, మూడులాంతర్ల జంక్షన్, కోట, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి ఆలయం, పాతబస్టాండ్ మీదుగా ఆలయం వరకు జరిగిన ఈ ఊరేగింపులో హంసవాహనంపై కొలువుదీరిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని, విశేష పూజలు చేశారు. స్వామి వారి జన్మనక్షత్రం ఆధికృతిక పురస్కరించుకుని, ఈ కార్యక్రమం చేయడం జరిగిందని ఆలయ వ్యవస్థాపకులు కర్రి వెంకటరమణ సిద్ధాంతి తెలిపారు.

నియోజకవర్గంలో వరి సాగు వివరాలు (14/07/25 నాటికి)		
మండలం	సాధారణ విస్తీర్ణం హెక్టార్లు	నాట్లు వేసిన విస్తీర్ణం
ఎస్.కోట	3991	233
వేపాడ	3546	320
ఎల్.కోట	3604	210
జామి	5322	220
కొత్తవలస	890	35



వరినారు

వరి సాగులో.. యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

- విత్తనశుద్ధితో తెగుళ్లు దూరం
- వ్యవసాయశాఖ ఏడీఏ భానులత



యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ భానులత, ఏఓ స్వాతి (ఫైల్)

వేపాడ: ఖరీఫ్‌లో వరి సాగుచేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల చీడపీడలను నివారించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మే, జూన్ నెలల్లో సాధారణ వర్షపాతం కంటే అధిక వర్షం కురవడంతో రైతాంగం ఖరీఫ్ వరి సాగుకు సమాయత్తమయ్యారు. వరినారు వేసేటప్పుడు విత్తన శుద్ధి చేయడం వల్ల చీడపీడలను నివారించుకోవచ్చని వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో వేపాడ, ఎస్.కోట, జామి, కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వరినాట్లు వేసిన పొలాలకు నీటి సమస్య లేదు. పలు గ్రామాల్లో ముందుగా వేసిన వరినారు నాటక పోవటంతో మరలా నారు పోస్తున్నారు. ఇప్పటికే వీలుపర్తి, బక్కునాయుడుపేట, భర్తవానిపాలెం, తదితర గ్రామాల్లో వరినాట్లు పూర్తికాగా.. వేపాడ, వల్లంపూడి, దబ్బిరాజుపేట, నల్లబిల్లి, వావిలపాడు, బొద్దాం, పాటూరు గ్రామాలతో పాటు ఎస్.కోట, ఎల్.కోట, జామి మండలాల్లో వర్షాధార పొలాలతో పాటు బోరు సదుపాయం ఉన్నచోట్ల వరినాట్లు వేస్తున్నారు. ఇదిలా ఉంటే వ్యవసాయాధికారులు పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆగస్టు 15లోగా బీమా ప్రీమియం చెల్లించాలి..

ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరి పంట ప్రకృతి వైపరిత్యాల వల్ల నష్టపోతే ప్రభుత్వం నుంచి పరిహారం పొందేందుకు గాను రైతులందరూ ఆగస్టు 15లోగా బీమా ప్రీమియం చెల్లించుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎకరా వరి పంటకు రెండు వందల రూపాయలు చెల్లించాల్సి ఉంది. ప్రీమియం చెల్లించేందుకు వన్‌బీ, ఆధార్, బ్యాంక్ ఖాతా, పంట ధ్రువీకరణ పత్రంతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలి. ప్రకృత వైపరిత్యాల వల్ల పంట నష్టపోతే ఎకరాకు రూ. 40 వేల వరకు పరిహారం అందే అవకాశం ఉంది.

నారు మడులు ఎండిపోకుండా చూసుకోవాలి



వర్షాభావంతో వరి నారుమడులు ఎండిపోకుండా చూసుకోవాలి. ఒకవేళ ఎండిపోయినట్లయితే 19/19/19 ఎరువును లీటర్ నీటిలో ఐదు గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులందరూ ఈకేవైసీ చేసుకోవాలి. కొత్తవలస సబ్ డివిజన్ పరిధిలో వివిధ కారణాల వల్ల ఆరువేల మందిని అనర్హులు గుర్తించాం. నిజమైన అర్హుల పేర్లు జాబితాలో లేకపోతే వెంటనే ఆర్ఎస్‌కేల్లో ఫిర్యాదు చేయాలి.

– బి.భానులత, వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు, కొత్తవలస

● ఆత్మీయ కలయిక



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గుర్ల: మండల కేంద్రంలోని తెట్టంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు. 2002లో పదో తరగతి చదివిన వారు సమావేశమై చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సహచర విద్యార్థులను ఆదుకోవాలని నిర్ణయించారు. అనంతరం ఉపాధ్యాయులు శంకర్, చంటిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బూర్లె జోగినాయుడు, సతీష్, లక్ష్మునాయుడు, అప్పలనాయుడు, నాగేశ్వరరావు, గోవింద్, నాగరాజు, రామారావు, నాగమణి, చిన్నారి, పైడిరాజు, మంగమ్మ, సతీష్ పాల్గొన్నారు.

● పొంచి ఉన్న ప్రమాదం



అరుకు - విశాఖ జాతీయ రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

లక్కవరపుకోట: మండలంలోని అరుకు – విశాఖపట్నం రోడ్డులో గోల్డ్‌స్టార్ జంక్షన్ సమీపంలో ఎస్ఆర్ పెట్రోల్ బంకు వద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. గోతిలో కర్ర ఏర్పాటు చేయడంతో వాహనదారులు కాస్త అప్రమత్తమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వేగేట్ సమీపంలో ఉన్న కృష్ణాజీ లేఔట్‌లో సోమవారం ఉదయం వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశానికి శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరై కూటమి ప్రభుత్వం సంవత్సరం కాలంలో చేసిన మోసాలను వివరిస్తారన్నారు. అన్ని గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమం

చీపురుపల్లి:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆరోపించారు. ఈక్రమంలోనే మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలంగా ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు ఆయన తండ్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్ల కూడా కూటమి నేతలు అనుచితంగా వ్యవహరిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికు అత్యంత సన్నిహితులుగా ఉంటున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిలపై నిరాధార ఆరోపణలు తప్ప ఒక్కటి కూడా నిరూపించలేక పోయారని తెలిపారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో మిథున్‌రెడ్డి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తుండడం చూసి కూటమి ప్రభుత్వానికి కన్ను కుట్టిందన్నారు. అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్న వారికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

జామి: మండల పరిధిలని పలు గ్రామాల్లో సోమవారం నుంచి 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతాడ, పావడ, జాగరం గ్రామాల్లో సోమవారం నిర్వహించనున్న కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరవుతారని పేర్కొన్నారు. 22న అట్టాడ, కుమరాం.. 23న కలగాడ, శిరికిపాలెం, అలమండ.. 24న ఎం.కె.వలస, బలరాంపురం, ఏఆర్ పేట.. 25న ఆర్‌బీ పురం, గొడికొమ్ము, జేడీ వలస.. 26న లొట్లపల్లి, రామయ్యపాలెం, భీమసింగి.. 28న లక్ష్మీపురం, తానవరం.. 29న విజినిగిరి, తాండ్రంగి.. 30న వెన్నె, జన్నివలస, వీఆర్ పాలెం.. 31న శాశనపల్లి, సోమయాజులపాలెం .. ఆగస్టు 1 నుంచి 4 వరకు మండల కేంద్రమైన జామిలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

రైతుబజారు కొనసాగించాలి

- పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు



మాట్లాడుతున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు

విజయనగరం గంటస్తంభం: పాత మహారాజా ఆస్పత్రి వద్ద ఉన్న రైతుబజారును అక్కడే కొనసాగించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆ బజారు వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఈ బజారు స్థలం రాజులది కాదని, 1922 నుంచి అది ప్రభుత్వ స్థలమేనని, దానిని అశోక్ గజపతిరాజు కాజేయాలని చూడడం సరికాదన్నారు. 1922 నుంచి 1995 వరకు ఇక్కడ మహారాజా ప్రభుత్వ ఆస్పత్రి కొనసాగిందని, 1995లో దాన్ని వేరే చోటుకి తరలించారన్నారు. 1995 నుంచి 1999 వరకు ఖాళీగా ఉన్న స్థలం ప్రైవేట్‌ది అయితే 1999లో ఇదే అశోక్ గజపతిరాజే రైతుబజారును ఎలా ప్రారంభించారని ప్రశ్నించారు. ఇది మహారాజా వారి వారసుల స్థలం అనడానికి ఎటువంటి ఆధారాలు లేవని 2018లో టీడీపీ ప్రభుత్వమే సీసీఎల్ఏ ఆఫీస్ నుంచి జీవో ఇచ్చిందన్నారు. 26 ఏళ్లుగా ప్రభుత్వ స్థలంలో నడుస్తున్న రైతు బజారుని ఎత్తేసి రైతుల బతుకు రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. ఇక్కడే రైతు బజారు కొనసాగించి, మిగతా స్థలం ప్రభుత్వం ఆఫీస్‌లకి ఉపయోగించాలన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టి ధర్నా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ ఈ పోరాటంలో అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలస కూడలి వద్ద ద్విచక్ర వాహనదారుడ్ని కారుఢీ కొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్.బూర్జవలస ఎస్సై జి. రాజేష్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. ద్విచక్ర వాహనదారుడు అనిల్‌కుమార్ అత్తవారి గ్రామమైన రామభద్రపురం మండలం మిర్తివలస నుంచి విశాఖకు ఆదివారం ఉదయం బయలుదేరాడు. సరిగ్గా మర్రివలస జంక్షన్‌కు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న కారు ఢీ కొనడంతో అనిల్‌కుమార్‌కు గాయలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రుడ్ని విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమికి ప్రజలే బుద్ధి చెబుతారు..

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో ప్రజాపాలనను గాలికొదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ కుట్రపూరిత రాజకీయాలు కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని, ఆ రోజులు దగ్గరలోనే ఉన్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఓ ప్రకటనలో ఆదివారం విమర్శించారు. ఎటువంటి ఆధారాలు లేకపోయినా ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఖండించారు. వారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో సృష్టిస్తున్న అరాచకాలను ప్రజలంతా గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని జోష్యం చెప్పారు.

ప్రతి ఇంటా భగవద్గీత..



ప్రతి ఇంటా భగవద్గీత వినిపించాలని మోక్ష విద్య యోగామందిర్ వ్యవస్థాపకుడు శీలా కోటీశ్వరరావు అన్నారు. ఇంటింటా భగవద్గీత ప్రచారం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం పట్టణంలో గౌరీశంకర్ కాలనీలో పర్యటించి భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాస్కర శర్మ, ధాత్రరాజు, కిశోర్, హరీష్, మణికంఠ, సురేష్, తదితరులు పాల్గొన్నారు. – శృంగవరపుకోట

వర్షంలోనూ నిరసన..



జిందాల్ కంపెనీకి ఏర్పాటు చేయకపోవడంతో ఇచ్చిన భూములను తమకు తిరిగి ఇచ్చేయాలని జిందాల్ నిర్వాసితులు ఆదివారం నిరసన చేపట్టారు. వీరికి అండగా సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. – శృంగవరపుకోట

పహారా..



జిందాల్ యాజమాన్యం రైతుల నుంచి తీసుకున్న భూములకు సంబంధించి ధర్నాలు, ఆందోళనలు చేపడుతుండడంతో ఆ భూముల వద్ద పోలీసులు ఆదివారం పహారా కాశారు. రైతులను కట్టడి చేస్తున్న పోలీసులు కంపెనీకి అండగా నిలవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. – శృంగవరపుకోట

చెరువు కాదు రోడ్డే...



వర్షం కురిసిన ప్రతిసారీ ఎస్.కోట పట్టణ ప్రధాన రహదారి చెరువును తలపిస్తోంది. కాలువలు ఆక్రమణలకు గురికావడంతో వర్షపు నీరు పోవడానికి దారి లేకుండా పోయింది. ఎన్నికల వేళ ఓట్లు దండుకున్న పాలకులకు మా పాట్లు పట్టవా అంటూ పట్టణవాసులు లబోదిబోమంటున్నారు.

– శృంగవరపుకోట

ఇంటింటికీ చంద్రబాబు మోసాలు..



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని చుక్కవలస గ్రామంలో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోనికి వచ్చి 13 నెలలు గడిచినా నేటికీ ఏ పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పించన్లు మంజూరు చేయలేదని ప్రజలకు వివరించారు. తల్లికి వందనం కూడా అందరికీ ఇవ్వలేదని, రూ. 15 వేలు అని చెప్పి 13 వేల రూపాయలు మాత్రమే ఇచ్చారని చెప్పారు. నిరుద్యోగ యువతకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి.. ఉచిత బస్సు ఊసే లేదన్నారు. ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో కుటుంబం ఎంతమేర నష్టపోయినదీ వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, స్థానిక సర్పంచ్ మీసాల విజయలక్ష్మి, నాయకుడు మీసాల అన్నంనాయుడు, వైస్ ఎంపీపీ జి.శ్రీరాములనాయుడు, రాష్ట్ర పంచాయతీ రాజ్ వింగ్ జాయింట్ సెక్రటరీ లెంక శ్రీరాములు, సర్పంచ్ జి.తమ్మినాయుడు, ఎంపీటీసీ సభ్యులు టొంపల సంజీవ్, యల్లంటి పోలీస్‌నాయుడు, మాజీ సర్పంచ్ అలమండ అప్పలనాయుడు, ముద్దాడ రమణ, తదితరులు పాల్గొన్నారు.